ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు

జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

● గంజాయి నిర్మూలనకు నిఘా
● బహిరంగ మద్యపానం జరగరాదు ● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

జమ్మలమడుగు, ఆగస్టు 22: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జమ్మలమడుగు సబ్‌డివిజన్ కేంద్రంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తగా నిర్మించిన పోలీసు స్టేషన్ ఆవరణలో తిరిగి పరిశీలించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాదితులతో మాట్లాడారు. అనంతరం స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గండికోట పర్యాటక ప్రాంతానికి శని, ఆదివారాల్లో ఎక్కువ మంది వస్తారని అక్కడ గస్తీ పెంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అర్బన్ సీఐ లింగప్పకు ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ప్రజల ద్వారా రౌడీ మూకల గురించి తెలుసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. జమ్మలమడుగు, మైలవరం, పెన్నానది పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి, మట్కా, క్రికెట్, బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘికాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జమ్మలమడుగు చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో నిఘా పెట్టి గంజాయి విక్రయాలు ఎక్కడైనా జరుగుతుంటే అరికట్టాలన్నారు. బహిరంగ మద్యపానం జరగకుండా మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని ఆయా ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మద్యపానం అరికట్టడం వలన నేరాలు తగ్గుతాయని ప్రజలకు పోలీసులపై నమ్మకం కలుగుతుందని సూచించారు. నూతనంగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహితపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామక్రిష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన

● విద్యుత్‌షాక్‌తో బాలుడి మృతి బాధాకరం
● బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా
● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పాలన కొనసాగుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. కడప నగరంలో విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతిచెందడం బాధాకరమని అన్నారు. గురువారం ఆయన కడప నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్లుగా విధ్వంసం, అవినీతి అరాచక పాలన కొనసాగిందన్నారు. భూకబ్జాలు మాఫియాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలతో ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా వెళుతున్నారని అన్నారు. పింఛన్లు పెంచి ఇచ్చిన విషయం గుర్తుచేశారు. త్వరలో జిల్లాలో కూడా అన్నక్యాంటీన్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం హామీ కూడా నెరవేర్చే దిశగా చర్యలు జరుగుతున్నాయన్నారు. వీటితో పాటు మిగతా హామీలను కూడా దశల వారీగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నిన్న కడప నగరంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన బాలుడి కుటుంబానికి 24గంటలు గడవకముందే ప్రభుత్వం ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చిందన్నారు. అలాగే గాయపడి చికిత్స పొందుతున్న బాలునికి కూడా రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా కడప ఎమ్మెల్యే మాధవీ చేతుల మీదుగా అందించామన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు అధిక శాతంలో వస్తున్నాయని, కొప్పర్తి అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. కేంద్రం సహకారంతో అన్ని రంగాల్లో రాష్ట్రం ముందుకు సాగుతుందని త్వరలో కడప జిల్లాలో స్టీలు పరిశ్రమ కూడా ప్రారంభం అవుతుందన్నారు. భూకబ్జాలపై రాష్ట్ర వ్యాప్తంగా విచారణలు జరుగుతున్నాయని, వైసీపీ అరాచకాలు, భూకబ్జాలు బయటపడుతున్నాయన్నారు.



అధికారంలోకి వస్తే ఐదులక్షలతో ఇళ్లు కట్టిస్తామని చెప్పిన జగన్ .. అధికారం చేపట్టాక పేదలను నిలువునా ముంచారు. పట్టణాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలమిచ్చి ఇళ్లు కట్టుకోమన్నారు. అది కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1.80లక్షల సొమ్ముతోనే. అయితే ఆ సొమ్ముతో ఇళ్లు కట్టుకోలేమంటూ చాలాచోట్ల లబ్ధిదారులు చేతులెత్తేశారు. వారితో వైసీపీ ప్రభుత్వం బలవంతంగా ఇళ్లు కట్టించే యత్నం చేసింది. కొన్నిచోట్ల మాత్రం ఆప్షన్-3లో భాగంగా ప్రభుత్వమే లబ్ధిదారులకు కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లు కట్టించడం మొదలు పెట్టింది. అయితే ఇళ్లు పూర్తి కాకుండానే అస్మదీయ కాంట్రాక్టర్లకు అదనంగా బిల్లులు చెల్లించడం ఒక ఎత్తయితే నాసిరకం నిర్మాణాలు బినామీలతో చేయించారనే ఆరోపణలు వచ్చాయి. వాటిపై ప్రభుత్వం విజిలెన్స్‌తో విచారణ చేయిస్తుండటంతో అవినీతికి పాల్పడ్డ వారిలో ఆందోళన మొదలైంది.

హౌసింగ్‌పై విజి'లెన్స్'



● ఆప్షన్-3 ఎంచుకున్న లబ్ధిదారులకు..
● కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్ల నిర్మాణాలు
● నాసిరకం నిర్మాణాలు.. అయినా అదనపు బిల్లుల చెల్లింపులు
● ప్రభుత్వం మారడంతో ముఖం చాటేసిన కాంట్రాక్టర్
● ప్రారంభమైన విజిలెన్స్ విచారణ

(కడప-ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతింటి కల సాకారం చేయడంలో భాగంగా నాటి జగన్ ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు ఆప్షన్లు ఇచ్చింది. ఇందులో ఆప్షన్ 3 ఎంచుకున్న లబ్ధిదారులకు సంబంధించి ఇళ్ల నిర్మాణాలను రాష్ట్రవ్యాప్తంగా రాక్రీటు, జేఎస్ఆర్ సంస్థలకు కట్టబెట్టారు. జగన్ సొంత నియోజకవర్గంలోని పులివెందుల లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను రాక్రీట్ చేపట్టగా.. బద్వేలు, ప్రొద్దుటూరులో జేఎస్ఆర్ ద్వారా నిర్మాణాలు చేపట్టింది. జిల్లాలో ఆప్షన్-3 కింద ఎంచుకున్నవి 21,722 ఇళ్లు ఉన్నాయి. కడప, చెన్నూరు, చక్రాయపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందులలో కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పులివెందులలో వేసిన లేఅవుట్‌పై పెద్ద దుమారమే రేగింది. ఇక్కడ పేదల ముసుగులో వైసీపీ నేతలు ఇళ్లు దక్కించుకున్నారు. స్థానికేతరులకు షావుకార్లకు ఇళ్లిచ్చారు. నాసిరకం నిర్మాణాలు జరిగాయంటూ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. జగన్ తన హయాంలో సొంత నియోజకవర్గంలో వేసిన లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేయించుకోలేని పరిస్థితి వచ్చింది. సొంతూరులోనే ఇంటి నిర్మాణాలు ముందుకు సాగకుంటే కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాల్సింది పోయి బాగా ప్రేమ చూపించారంటారు. బిల్లుల చెల్లింపులో భారీ గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి.

ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపులు

జగన్ హయాంలో ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలను ప్రధానంగా రెండు సంస్థలకు కట్టబెట్టారు. వాటిలో ఒకటి రాక్రీట్ మరొకటి జేఎస్ఆర్. ఈ రెండు వైసీపీ నేతలవని చెబుతారు. పులివెందులలో 323 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. మొత్తం 8,400 ఇళ్లు మంజూరు కాగా ఆప్షన్-3ని 6,739 మంది ఎంచుకున్నారు. దీంతో ఇక్కడ నిర్మాణ బాధ్యతలను అనంతపురం జిల్లాలోని ఓ మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి చెందిన వారికి కట్టబెట్టారు. ప్రభుత్వం సూచించిన నమూనాలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు కొద్దిరోజులు నిర్మాణ పనులే చేపట్టలేదు. జగన్ ఇలాకాలోనే ఇళ్ల నిర్మాణాల దుస్థితిపై ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలు ప్రచురించింది. చివరికి అధికారులు ఒత్తిడి తెచ్చి పనులు మొదలుపెట్టించారు. అయితే నిర్మాణాలు పూర్తి కాకముందే ఇవ్వాల్సిన దానికన్నా బిల్లులు ఎక్కువ ఇచ్చారనే ఆరోపణలున్నాయి. ఒక ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80లక్షలు ఇస్తుంది. ఈ మొత్తం సరిపోవడం లేదని లబ్ధిదారులు గగ్గోలు పెట్టడంతో.. స్వయం సహాయక సంఘాల్లోని లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35వేలు రుణం ఇచ్చారు. ఈ సొమ్మును కూడా కాంట్రాక్టు సంస్థ తీసుకుంది. అంటే ఒక్కో ఇంటిని రూ.2.15లక్షలు తీసుకుని నిర్మించాల్సి ఉంది. ఇంటి నిర్మాణానికి సంబంధించి పునాదులకు, బేస్‌మెంటు, లింటల్‌లెవల్, రూఫ్‌లెవల్, ఇల్లు పూర్తయితే... ఇలా దశల వారీగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది. దశల వారీగానే ఇనుము, సిమెంటు, ఇతర నిర్మాణ సామగ్రిని అందిస్తుంటుంది. పులివెందుల లేఅవుట్‌కు సంబంధించిన బిల్లులు చెల్లింపుల్లో గోల్‌మాల్ సాగిందనే ఆరోపణలున్నాయి. బేస్‌మట్టం లెవెల్‌లో ఉన్న ఇళ్లకు, లింటల్‌లెవల్, రూఫ్‌లెవల్.. అసలు పునాదులు తీయని వాటికి కూడా బిల్లులు చెల్లింపులు చేశారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ దాదాపు 1500 మందికి పైగా స్థానికేతరులు, షావుకార్లకు పేదల మాటున ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని అంటున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం రూ.82,74,24,497 చెల్లించింది. ఇందులో నగదు రూపంలో బిల్లులు రూ.59,56,17,014, సిమెంటు, ఇనుము, ఇసుకకు సంబంధించి రూ.23,18,07,483 చెల్లించారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందనే ధైర్యంతో బిల్లుల మంజూరులో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. అయితే వైసీపీ బొక్కబోర్లాపడి కూటమి ప్రభుత్వం రావడంతో అవినీతికి పాల్పడ్డ కాంట్రాక్టర్ పనులు చేయకుండా జంప్ అయ్యారు. పులివెందుల లేఅవుట్‌కు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో వ్యత్యాసం ఉండడంతో విజిలెన్స్‌తో విచారణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విజిలెన్స్ బృందం విచారణ జరుపుతోంది.

ఆప్షన్-3 కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు, డేటా, బిల్లుల చెల్లింపులు, ఇళ్ల నిర్మాణాలు ఏ యే స్టేజీలో ఉన్నాయి, ఏ ఇంటికి ఎంత బిల్లు చెల్లించారు, ఎంత సిమెంటు, ఇసుక ఇచ్చారు.. అసలు నిర్మాణాలు జరిగాయా, నిధులు కాంట్రాక్టు సంస్థకు బదిలీ అయ్యాయా లాంటి విషయాలపై పూర్తిగా విచారణ చేపట్టారు. బుధవారం నాటికి విచారణ పూర్తయింది. విచారణాధికారులు వివిధ దశల్లో ఉన్న 4,950 ఇళ్లను ఫొటోలు తీసుకున్నారు. అలాగే అర్హులుకాని లబ్ధిదారులు 2,450 మందికి నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు రికార్డులన్నీ తీసుకుని విచారణాధికారులు గురువారం విజయవాడ వెళ్లారు. విచారణ నివేదిక వస్తే కానీ ఆప్షన్-3 మాటున కాంట్రాక్టర్లకు జనం సొమ్ము ఎంత కట్టబెట్టారనేది బట్టబయలు కాదు. అయితే.. పులివెందుల జగనన్న లే అవుట్‌లో కాంట్రాక్టర్లు కట్టిన నాసిరకం ఇళ్లను చూస్తే.. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని స్పష్టంగా తెలుస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.





పులివెందులలోని జగనన్న లేఅవుట్‌లో అర్ధాంతరంగా ఆగిపోయిన నిర్మాణాలు

అమరావతి నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



వీరపునాయునిపల్లె, ఆగస్టు 22: రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.10లక్షల విరాళాన్ని వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందిన ఎన్‌వీ నారాయణరెడ్డి విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆయన కార్యాలయంలో కలసి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సమక్షంలో రూ.10లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పాయసంపల్లె మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి, కంకర సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

● అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు
● టోల్ ఫ్రీ నెంబరు-08562-246344
● కలెక్టర్ శివశంకర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్.. చిత్రంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పంపిణీ విధానం జిల్లాలో పారదర్శకంగా సాగేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా ఇసుక పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలను అమలు చేయనున్నామన్నారు. ఉచిత ఇసుక విధానంలో కేవలం నిర్వహణ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నామని, ప్రజలపై ఎలాంటి పన్నులభారం మోపడం లేదన్నారు. జిల్లాలో మొత్తం 11 స్టాక్ పాయింట్లు ఉండగా అందులో 6 చోట్ల ఇసుక పూర్తిగా అయి పోయిందన్నారు. పెండ్లిమర్రి మండలం పగడాలపల్లి, వీఎన్‌పల్లిలోని ఎర్రబెల్లి, కొండాపురంలోని వెంకటాపురం, పి.అనంతపురం, సిద్దవటంలోని జ్యోతి స్టాక్ పాయింట్ల వద్ద 82,422 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. కొండాపురం మండలంలోని చిత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో కొత్తగా గుర్తించిన పి.అనంతపురం, ఏటూరు, సుగమంచి పట్నం డిసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుక సేకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక కావాలంటే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ద్వారా బుకింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఇసుక సరఫరాలో అక్రమాలు జరిగినా, అధిక ధరలకు విక్రయించినా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 08562-246344కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇక మీదట ఇసుక కావాల్సిన వినియోగదారుడు నిర్మాణాలకు సంబంధించిన వివరాలను ప్రొఫార్మాలో తెలపాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా ఉండేందుకు కడప, బద్వేల్ తదితర ప్రాంతాలకు అందుబాటులో ఉండేందుకు 3 ఇసుక రీచ్‌లు గుర్తించామన్నారు. సెప్టెంబరు1న కొత్త ఇసుక పాలసీని ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా కట్టడికి గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొబైల్ పార్టీలు, అన్ని స్టాక్ పాయింట్లు, ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెడుతున్నామన్నారు. జిల్లాలో 7 ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా చర్యలు పటిష్టం చేయనున్నామన్నారు. రెండు నెలల్లో 376 కేసులు నమోదు చేయడమే కాకుండా రూ.38 లక్షల జరిమానా విధించామన్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలించకుండా, వాహనాలు నదిలోకి దిగకుండా గుంతలు తీశామన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఏఎస్పీ వెంకట్రాముడు, శాండ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అన్నమయ్య' బాధ్యులపై చర్యలేవీ..?

● అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై అన్నీ అనుమానాలే ● పునర్నిర్మాణం రీటెండర్ల అవినీతిపై నిగ్గు తేల్చరా?
● నేడు ఉపముఖ్యమంత్రి పవన్ పర్యటన ● రాజంపేట ప్రాంతీయుల్లో చిగురిస్తున్న కోటి ఆశలు

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం గురించి దేశ చరిత్రలోనే ఎంతో విషాద దుర్ఘటన అని, ఇది కచ్చితంగా మానవ తప్పిదమేనని కేంద్ర ప్రభుత్వం నాటి పార్లమెంట్‌లోనే ప్రకటించింది. గత ప్రభుత్వ పాలకులు, సంబంధిత ప్రాజెక్టు అధికారుల ఉమ్మడి తప్పిదం కారణంగానే ఈ ప్రాజెక్టు తెగిపోయింది. ఈ దుర్ఘటనకు సంబంధించి ఇంతవరకు ఎవరిపై చర్యలు తీసుకోలేదు. అధికారులపై చర్యలు తీసుకుంటే ఆ తప్పిదం ప్రభుత్వంపై పడుతుందని జగన్ సర్కారు ప్రకృతిపై నెపం నెట్టేసి చేతులు దులుపుకుంది. ఇంకా చెప్పాలంటే.. ప్రాజెక్టు తెగిపోయినప్పుడు అందుకు కారణమైన ప్రధాన అధికారులే నేటికీ కొనసాగుతుండడం విశేషం. ఒక దుర్ఘటన జరిగినప్పుడు సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యల కింద వారిని బదిలీ చేయడమో లేకుంటే సస్పెండ్ చేయడమో జరుగుతుంది. ప్రాజెక్టు తెగిపోయి ఏకంగా 40 మంది ప్రాణాలు కోల్పోయి, 450 ఇళ్లు కొట్టుకుపోయి, వేలాది పశువులు చనిపోయి, వేల ఎకరాల భూమి ఇసుక పాలై 3 మండలాలను ముంచెత్తితే... ఒక్క అధికారిపై కూడా చర్య తీసుకోకపోవడం జగన్ ప్రభుత్వ పక్షపాత పాలనకు మచ్చుతునక. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలవుతున్నా ఆ దుర్ఘటనకు బాధ్యులైన అధికారులే నేటికీ కొనసాగుతుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

రాజంపేట, ఆగస్టు 22: అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వెనక.. గత ప్రభుత్వ వైఫల్యం, పాలకుల ఇసుక దోపిడీ, అధికారుల నిర్లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. 2.50 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిండడానికి పెద్ద సమయం పట్టదు. దుర్ఘటన జరిగినప్పుడు ఏకంగా 5.60 లక్షల క్యూసెక్కుల వరదనీరు ఒక్కసారిగా ప్రాజెక్టులో పడిందని అందువల్లే ప్రాజెక్టు తెగిపోయిందని ఈ విషయంలో తమ తప్పులేదన్నట్టు అధికారులు, అప్పటి వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. 2021 నవంబరు 19వ తేదీ తెల్లవారుజామున ప్రాజెక్టు తెగిపోయింది. దానికి రెండు రోజులు ముందుగానే ప్రాజెక్టులో 1.50 లక్షల క్యూసెక్కుల నీరు నిల్వ ఉంది. దిగువ ప్రాంతంలో ఇంతటి భారీవర్షాలు కురుస్తున్నప్పుడు కేవలం 2.50 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో ఉన్న నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదిలివేయాలి. అలా చేయలేదు. 5.60 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చిందంటే కేవలం గంటలోనే ప్రాజెక్టు నిండిపోతుంది. ఉన్న నిల్వ నీటిని వదులుతూ, భారీ వరదనీరు వచ్చినప్పుడు అప్రమత్తమై ముందుగానే అన్నిగేట్లు ఎత్తి ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని ఏ చిన్నపిల్లాడిని అడిగినా చెబుతారు. దిగువ ప్రాంతంలో నాటి వైసీపీ పాలకులు భారీఎత్తున ఇసుక తోలేందుకు ఉంచిన టిప్పర్లు, హిటాచీలు కొట్టుకు పోతాయనే ప్రాజెక్టు గేట్లు ఎత్తలేదనే ఆరోపణలు ఇప్పటికీ వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వమైనా ఈ దుర్ఘటనపై న్యాయ విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ప్రాజెక్టు తెగిపోవడానికి గల కారణాలపై న్యాయ నిపుణులచే విచారణ చేయించి ఇందులో నిజానిజాలను బయట పెట్టాల్సిన అవసరం ఉంది.



మూడేళ్ల కిందట తెగిపోయి అనాథలా మారిన అన్నమయ్య ప్రాజెక్టు ఏరియల్ వ్యూ

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం సాధ్యమేనా?

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం అదే ప్రాంతంలో సాధ్యమయ్యే పనికాదని అధికారులే చెప్పుకుంటున్నారు. 1969లో నాటి పెద్దలు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. నిధుల లేమివల్ల ఆలస్యమై.. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతంలో నది వెడల్పు తక్కువగా ఉండడం, కొండమార్గం ఉండడం, కొండకు అటు ఇటు లోయలు ఉండడం, ఆ ప్రాంతంలో గట్టిరాయి లేకపోవడం.. ఇలాంటి కారణాల వల్ల కేవలం 2.50 టీఎంసీల సామర్థ్యం ఉండే మధ్యతరహా ప్రాజెక్టును రూ.70 కోట్ల ఖర్చుతో పడుతూ లేస్తూ దాదాపు 30 ఏళ్లకు నిర్మించారు. 22 ఏళ్ల కిందట ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి పూర్తిస్థాయి నీటిని ఏనాడూ నిల్వ ఉంచలేదు. రెండుసార్లు గేట్లు కొట్టుకుపోవడం, వర్షాలు సక్రమంగా పడకపోవడం ప్రధాన కారణాలు. అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు 22,500 ఎకరాలకు ఏరోజు నీరందించలేదు. అంటే రూ.70 కోట్ల ఖర్చుతో ఏర్పాటైన ఈ ప్రాజెక్టు ఏరోజు అనుకున్న ఫలితం ఇవ్వలేదు. ఒక పెద్దపాటి చెరువులానే అన్నమయ్య ప్రాజెక్టు మారిపోయింది. ఈ ప్రాజెక్టు తెగిపోయినప్పుడు మాత్రం వేలకోట్ల రూపాయల నష్టం చేకూర్చింది. 40 మంది మనుషులను, వేలాది పశువులను బలిగొంది. వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేసి ఇప్పటికీ సాగుకు పనికిరాకుండా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2.50 టీఎంసీల నీరు నిలిచే చోట వైసీపీ ప్రభుత్వం ఏకంగా 10 టీఎంసీల సామర్థ్యంతో రూ.800 కోట్లతో ప్రాజెక్టు పునర్నిర్మిస్తామని చెప్పడం అందరిలో అనుమానాలు రేకెత్తించింది. కారణం ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణం పేరుతో రూ.800 కోట్లకు టెండర్లు పిలిచి ఆ పనులను చేజిక్కించుకుని తిరిగి కోట్లు గడించవచ్చునన్న దురాశ తప్ప వీరికి సదుద్దేశం ఏమాత్రం లేదనే విమర్శలు వచ్చాయి. ప్రాజెక్టు తెంచింది వైసీపీ పెద్దలే. తిరిగి పునర్నిర్మాణం పేరిట కోట్లు కొల్లగొట్టేదీ వాళ్లే అని పలువురు చర్చించుకున్నారు. అయితే సాధారణ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం కుప్పకూలిపోవడంతో అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం పేరిట కోట్లు దోచుకోవాలనుకున్న వారి ఆలోచనలకు గండి పడింది.

పక్కా ప్రణాళికతో నిర్మించాలి

నూతన ప్రభుత్వంపై ఈ ప్రాంత ఆయకట్టు రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కట్టకముందు చెయ్యేరు నది ద్వారా రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల ప్రజలకు ఏడాది పొడవునా వర్షం నీటితో 3 పంటలు పండుతూ ఈ ప్రాంతమంతా కోనసీమగా ఉండేది. ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు కట్టడం వల్ల ఈ మూడు మండలాలు కరువు ప్రాంతాలుగా మారిపోయాయి. కావున దిగువ ప్రాంతాలను, ఎగువ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ నీటిని నిల్వ ఉంచే ప్రాంతాన్ని గుర్తించి ఇటువంటి దుర్ఘటన జరగకుండా పక్కా ప్రణాళికతో ప్రాజెక్టు రూపకల్పన జరగాల్సి ఉంది. అలా కాదంటే ఇక్కడ ప్రాజెక్టు పునర్నిర్మించినా ఎక్కువ మందికి ఉపయోగకరంగా ఉండదని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శుక్రవారం ఇక్కడకు రానుండటంతో.. ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణంపై సంబంధిత జలవనరులశాఖ నిపుణులతో చర్చించి ప్రాజెక్టు పునర్నిర్మిస్తారని, ఎగువ, దిగువ ప్రాంత ప్రజలకు సమన్యాయం చేస్తారని రాజంపేట నియోజకవర్గ ప్రజలు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారుల వివరణ కోసం ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

లాక్ కనిపిస్తే.. లూటీనే





తాళం వేసి ఇళ్లనే టార్గెట్ చేసుకుంటారు. పక్కాగా రెక్కీ నిర్వహించి.. ఆపై దర్జాగా తాళాలు పగలగొట్టి ఇళ్లలోని బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను దోచుకుపోతారు. ఇటీవల ఇలాంటి దొంగతనాలు కడప నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లా లంటే.. భయంతో వణికిపోతున్నారు.

- తాళం వేసిన ఇళ్లపైనే కన్ను
- వరుస దొంగతనాలతో భయాందోళనలో ప్రజలు
- పోలీసు గస్తీ అంతంత మాత్రమే

కడప (క్రైం), ఆగస్టు 22: కడప నగరంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత మూడు రోజుల నుంచి కొంత మంది యువకులు దొంగతనాలు చేస్తూ.. విజయదుర్గాకాలనీలో తిరుగుతుండగా సీసీ పుటేజీల్లో రికార్డు అయింది. రెండిళ్లలో చోరీకి యత్నించి విఫలమైనప్పటికీ మరో రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో కేజీ వెండితో పాటు బంగారు నగలు దోచుకెళ్లారు. అలాగే ఇటీవల రాజు మార్ట్ వద్ద ఒకేసారి మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం కడప రాజారెడ్డివీధిలో సాయంత్రం ఇంటి కరెంటు బిల్లు కట్టేందుకు వెళ్లి తిరిగి వచ్చేలోపు ఆ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు దోచుకెళ్లారు. అదే రోజు ఓంశాంతి నగర్‌లో ఓ ఇంట్లో దొంగలు పడి నల్లపూసల దండ అపహరించారు.

స్టైల్ మార్చి.. దొంగతనాలు

ప్రస్తుతం దొంగతనాల స్టైల్ మారింది. చాకచక్యంగా నిమిషాల్లో తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ దోచుకుపోతున్నారు. ఒకప్పుడు దొంగతనం చేసిన విధానాన్ని బట్టి ఫలానా బ్యాచ్ చేసి ఉండొచ్చని పోలీసులు అంచనా వేసి దొంగలను పట్టుకునే వారు. పోలీసులు నిఘా పెట్టినా.. సీసీ కెమెరాలు ఉన్నా దొంగలను గుర్తించడంలో పోలీసులు గుర్తించలేని పరిస్థితి. కాగా, కొన్ని నెలల క్రితం కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఓ దొంగల ముఠా చెడ్డీ గ్యాంగ్‌లు ఆ ప్రాంతంలో తిరుగుతూ సీసీ పుటేజీలకు దొరికారు. వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారా లేక ఇక్కడ యువకులే అలా తయారై చోరీలకు పాల్పడుతున్నారా అనేది అర్థం కాని ప్రశ్న. ఏది ఏమైనా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు నిఘా కొరవడినట్లు తెలుస్తుంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

గత ప్రభుత్వ హయాంలో పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడిదల చేయకపోవడంతో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కాలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ కొరత ఉండడంతో ఉన్న సిబ్బందితోనే విధులు నెట్టుకొస్తున్నారు. కొందరు పోస్టింగులు ఒకచోట అయితే మరో చోట విధులు నిర్వహిస్తున్నారు. కేవలం బ్లూకోల్ట్స్ సిబ్బందితోనే గస్తీ నిర్వహి స్తున్నారు. కేవలం బ్లూకోల్ట్స్ సిబ్బందితోనే గస్తీ నిర్వహిస్తున్నారు. బాధితులు చోరీ ఘటనపై పోలీసుస్టేషన్‌లకు వెళితే సరైన స్పందన కనిపించడం లేదని, ఫిర్యాదు మేర కేసులు కట్టడం లేదని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల జమ్మలమడుగుకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు తన ఇంట్లో 30 తులాల బంగారు నగలు దొంగత నం జరిగితే పోలీసులు 20 తులాలకే కేసు కట్టారంటూ ఆ మహిళ ఎస్పీని ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

పనిచేయని సీసీ కెమెరాలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కమాండ్ అండ్ కంట్రోల్‌కు రూ.50లక్షలు విరాళం అందించారు. అలాగే దాతల సహకారంతో నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. అయితే నగర అభివృద్ధి పనుల పేరిట చాలా వరకు సీసీ కెమెరాలు తొలగించారు. దీంతో వాటిని మళ్లీ ఏర్పాటు చేయలేదు. దీంతో చోరీలో జరిగినా దొంగలను గుర్తించడంలో పోలీసులకు కష్టతరంగా మారింది. తొలగించిన కెమెరాలను పునరుద్ధరిస్తే దొంగలను గుర్తించేందుకు దోహదపడుతుంది.

ఎల్‌హెచ్ఎంఎస్‌పై అవగాహన అంతంత మాత్రమే

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్) ద్వారా దొంగలను నిమిషాల్లోనే పట్టుకునేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో ఈ యాప్ ద్వారా దొంగల ముఠాను అరెస్టు చేసి భారీ ఎత్తున రికవరీ చేశారు. అప్పట్లో ఎవరైనా ఊర్లకు వెళ్లేవారు ఈ



విజయదుర్గకాలనీలో సంచరిస్తున్న అనుమానితులు (ఫైల్)

ఎల్‌హెచ్ ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకునేవారు. ప్రస్తుతం దీనిపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ప్రజలు వినియోగించుకోలేకపోతున్నట్లు అర్థమవు తుంది. అలాగే విలువైన వస్తువులు ఇంట్లో పెట్టుకుని.. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఊర్లకు వెళుతుండడంతో దొంగలు ఆ ఇంట్లో దోచుకోవడం ఈజీగా మారుతోంది. ఎవరైనా ఊర్లకు వెళ్లాల్సి వస్తే సంబంధిత పోలీసులకు సమాచారం ఇస్తే ఆయా ఇళ్లపై పోలీసు నిఘా ఉంటుంది. తద్వారా దొంగతనాలను అరికట్టడానికి ఆస్కారం ఉంటుంది.

కొరవడిన పోలీసుల నిఘా

కడప నగరంలో వరుస దంగతనాలు జరుగుతుండటంతో పోలీసుల నిఘా కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. కడపలో సీసీఎస్ పోలీసు స్టేషన్ ఉన్నప్పటికీ చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచలేకపోతున్నారు. సిబ్బంది కొరత, ఏళ్లతరబడి కొందరు సిబ్బంది ఇక్కడే కొనసాగుతుండటం.. వారు స్టేషన్‌లకే పరిమితమవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో దొంగతనం కేసుల్లో కీలక పాత్ర పోషించే సీసీఎస్ బృందం గత కొన్ని సంవత్సరాలుగా ఒక కేసు చేధించిన సందర్భం లేదు. ప్రస్తుతం సీసీఎస్ బృందాన్ని పెంచి దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముమ్మరంగా గస్తీ చేపడుతున్నాం

దొంగతనాలను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా పెట్టి.. గస్తీని ముమ్మరంగా చేపడుతున్నాం. ఎస్పీ కేటాయించిన స్పెషల్ టీంతో పాటు ప్రతిరోజు సీఐలు, ఎస్ఐలు ఐడీ పార్టీ సిబ్బందితో రాత్రి సమయంలో తనిఖీలు చేస్తున్నాం. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పూర్తి స్థాయిలో విచారిస్తున్నాం.

- భాస్కర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ

డిష్ కేబుల్ నెట్‌వర్క్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల కాదు : ఎస్ఈ



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ రమణ

కడప (నాగరాజుపేట), ఆగస్టు 22: కడప నగరంలోని బెల్లంమండీవీధిలో బుధవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందగా.. మరో బాలుడు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదం విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్ల జరగలేదని, డిష్ కేబుల్‌కు జతపరిచిన జీఐ వైరు వల్ల మాత్రమే జరిగిందని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ తెలిపారు. గురువారం విద్యుత్‌భవన్‌లో తన ఛాంబరులో విలేకరుల సమావేశం మాట్లాడుతూ.. చెట్టుపై నుంచి తెగిపడి వేలాడుతున్న డిష్ కేబుల్‌కు జత చేసిన జీఐ వైరు బాలురు సైకిల్‌పై వెళుతుండగా.. కాళ్లకు తగు లుకుని సైకిలు చక్రాలలో ఇరుక్కుపోయింది. అలాగే ముందుకు పోవడంతో విద్యుత్ ప్రవహిస్తున్న ట్రాన్స్‌ఫార్మరు వద్ద గల హెచ్‌డీ ఫ్యూజు సెట్ వద్ద 11 కేవీ లైనుకు తగలడంతో విద్యుత్ ప్రవాహం జరిగి ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి ముందు ఆ ప్రాంతంలో డిష్ వైరు తెగిపడి ఉందని, అక్కడి ప్రజలు తెలిపారన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి వీధుల్లో సంచరించే వేళ ప్రతి కేబుల్ వైరును చూసుకుంటూ జాగ్రత్తగా పోవాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి వేలాడుతుంటే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు వాట్సప్ నెంబరు 9440814264కు తెలియజేయవచ్చన్నారు. ప్రజలు సొంతంగా విద్యుత్ మరమ్మత్తులు చేయకూడదన్నారు. ఏదైనా సమస్య ఉంటే విద్యుత్‌సిబ్బందికి సమస్య తెలిపితే.. సరిచేస్తారని తెలిపారు.

ఐదేళ్ల ఎంఎస్‌సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులైన వారు అర్హులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేడెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ పరిధిలోని ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంటు, రాయల్టీ ఇన్‌స్పెక్టరు జియాలజీస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఏపీ హెచ్‌ఆర్ఏసీ, ఏపీ ఎస్ఎండీసీ, ఏపీ గ్రౌండ్‌వాటర్ బోర్డు సంస్థల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22 నుంచి 24లోపు ఓఏ ఎండీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8985597928 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

వైవీయూలో పలు విభాగాలు తనిఖీ

వైవీయూలో గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి పలు విభాగాలను తనిఖీ చేశారు. హాస్టలు గదులను, వంట శాలలను పరిశీలించారు. అపరిశుభ్రతకు తావు ఇవ్వకూడదని అక్కడున్న సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రవేశాల సంచాలకుల కార్యాలయం సందర్శించి ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసరు దాము, డీవోఏ డైరెక్టరు లక్ష్మీప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి



పీఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

రాయచోటిటౌన్, ఆగస్టు 22: దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన కలకత్తాలోని ఆర్జికార్ ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి నాగేంద్రబాబు, జిల్లా కన్వీనర్ వెంకట్రమణలు మాట్లాడుతూ ఘటన జరిగి పది రోజులు గడిచినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ ద్వారా త్వరితగతిన విచారణ జరిపించాలని, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నైతిక బాధ్యత వహించి తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై బాధ్యత వహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిజనిజాలను బయటికి రాకుండా తుంగలోకి తొక్కి.. నిందితులను కాపాడే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. జూనియర్ డాక్టర్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలబడి అన్ని విధాలుగా ఆదుకోవాలని, తక్షణమే నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీలు పాల్గొన్నారు.

హోంగార్డుపై దాడి చేసిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు

- నిర్లక్ష్యం వహించిన ఎస్ఐకి షోకాజ్ నోటీసు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పులివెందుల టౌన్, ఆగస్టు 22: పులివెందుల పట్టణంలో హోంగార్డుపై దాడి చేసిన సంఘటనలో రౌడీషీటర్ సాయి, అతని స్నేహితులపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై పోలీ సులు, హోంగార్డులచే ప్రతి రోజు పట్టణ శివార్లలో పహారా చేయిస్తు న్నామన్నారు. ఈక్రమంలో ఈనెల 19వ తేదీ రాత్రి పట్టణంలోని కదిరి రోడ్డులో కనికరం సాయి, అతని మిత్రులు మద్యం తాగుతుండగా హోంగార్డులు శివ మల్లేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు ప్రశ్నించినందుకు చేయిచేసుకున్నారు. బుధవారం సాయి, అతని మిత్రులపై నాన్ బెయిల బుల్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈసంఘటనపై కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐకి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా షోకాజ్ నోటీస్ ఇచ్చామని.. రైటర్ గోవిందును పనిష్‌మెంట్ కింద సింహాద్రిపురం స్టేషన్‌కు అను సందానం చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

పెళ్లిలో ఘర్షణ.. కత్తితో దాడి ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్రిష్ణయ్య

కమలాపురం రూరల్, ఆగస్టు 22: పట్టణంలోని అప్పాయపల్లె సీఎస్ఐ చర్చి ప్రాంగణం లో గురువారం జరిగిన పెళ్లిలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో మద్యం మత్తులో క్రిష్ణయ్యను ఏసన్న అనే వ్యక్తి కత్తితో పొడవడంతో గాయాలయ్యాయి. కొండాపురం మండలం పి.అనంతపురం గ్రామానికి చెందిన ఏసన్న గడ్డం రాజు వివాహానికి వచ్చారు. ఏసన్న గడ్డంరాజు తండ్రిని మద్యం మత్తులో హేళనగా మాట్లాడడంతో వారిద్దరి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇంతలో అక్కడే ఉన్న క్రిష్ణయ్య కలగజేసుకుని ఘర్షణ పడవద్దని చెప్పగా మధ్యలో నీ పెత్తనం ఏందంటూ ఏసన్న క్రిష్ణయ్యపై కత్తితో దాడి చేయడంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు, బంధువులు క్రిష్ణయ్యను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

- బాధితులు ప్రొద్దుటూరు వాసులు

జలదంకి, ఆగస్టు 22: నెల్లూరు జిల్లా జలదంకి మండలంలోని 9వ మైలు చీకటివాగు వంతెన సమీపంలో హైవేపై గురువారం తెల్లవారుజామున కారు బోల్తా పడగా, అందులో ప్రయాణిస్తున్న కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన భార్యాభర్తలు టీ సుధాకర్, టీవిజయలక్ష్మిలకు గాయాలయ్యాయి. 9వమైలు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఓ వివాహానికి వీరు హాజరయ్యారు. తెల్లవారుజామున టీ తాగేందుకు కారులో జలదంకి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కారులో ఉన్న వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు వారిని పరామర్శించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



కడప (క్రైం), ఆగస్టు 22: కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా... ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.2 ఉన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9440900811, 9440627398 ఫోను చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి



సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 22: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని అనంతపురం గొల్లపల్లెలో శుభకార్యానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామీణ రోడ్లు, తాగునీరు, ఉపాధి హమీపథకంపై ప్రత్యే దృష్టి పెడుతున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో ఏర్పాటు చేస్తాం, ఇళ్లు లేని ప్రతి నిరుపేదకు పార్టీలకు అతీతంగా ఇంటి పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మిస్తామన్నారు. కూటిమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని తెలిపారు. అనంతరం ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. అలాగే లక్కిరెడ్డిపల్లెలో కస్తూర్భాగాంధీ విద్యాలయానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన మంత్రి వెంటనే రోడ్డు ఏర్పాటు చేసి పాఠశాలలోని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అంబేద్కర్ బాలికల గురుకల పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాదుబాబు, టీడీపీ నాయకులు పాపయ్య, డాక్టర్ షఫీ నాయక్, ఆరిపుల్లా, చెల్లు శ్రీనివాసులు, శివ, రామాంజనేలు, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.


సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటిటౌన్, ఆగస్టు 22: పట్టణంలో ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు జరగబోయే సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు సంబంధించిన పోస్టర్లను గురువారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. మంత్రిని ఏపీ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ ట్రెజరర్ చంద్రశేఖర్‌తో పాటు అన్నమయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నేతలు వీరాంజనేయులు, రెడ్డెయ్య, రేవంత్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి రాయచోటిలో జరగబోయే సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ పురుషుల, మహిళల విభాగం పోటీల గురించి ఆయనకు వివరించారు.

హోంగార్డ్స్ పరేడ్ తనిఖీ

కడప (క్రైం), ఆగస్టు 22: జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో గురువారం హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్ హోంగార్డ్స్ పరేడ్‌ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ హోంగార్డులు పలు ప్రభుత్వశాఖల్లో పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారన్నారు. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని.. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే సబ్‌డివిజన్ హోంగార్డు ఇన్‌చార్జ్‌లకు కానీ రిజర్వు ఇన్‌స్పెక్టరుకు కానీ తెలిపి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



పులివెందుల, ఆగస్టు 22: తొండూరు మండలంలోని మడూరు గ్రామానికి చెందిన ముక్కోటి శ్రీదేవి (53) అదృశ్యమైనట్లు తొండూరు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... ఈనెల 19వ తేదీ ఉదయం 9గంటలకు శ్రీదేవి ఇంటి నుంచి వెళ్లిపోయిందని.. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండేది కాదని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు తొండూరు ఎస్ఐ 9121100617, పులివెందుల రూరల్ సీఐ 9121100549 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ముగ్గురు మట్కాబీటర్లు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 22: పెన్నానగర్‌లోని వాటర్ పంప్ హౌస్ వద్ద ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వచ్చిన సమాచారంతో కొణిదెల దస్తగిరి, షేక్ హుస్సేన్ బాష, షేక్ కమాల్‌బాషలు మట్కా పట్టీలు రాస్తుండగా తమ సిబ్బందితో కలిసి దాడిచేసి ముగ్గురుని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,02,000 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనం బోల్తా .. తప్పిన ప్రమాదం

నందలూరు, ఆగస్టు 22: కడప-చెన్నై, ప్రధాన జాతీయ రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం సమీపంలో గురువారం కడప నుంచి రాజంపేటకు వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఏమీ కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కడప (క్రైం), ఆగస్టు 22 : కడప నగరం బైపాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలసుబ్బరాయుడు అనే యువకుడు గాయపడినట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. సిద్ధవటం మండలం వడ్డెవారిపల్లెకు చెందిన బాలసుబ్బరాయుడు సొంత పని నిమిత్తం కడపకు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి కింద పడటంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


పది ఇసుక ట్రాక్టర్లు సీజ్

వల్లూరు, ఆగస్టు 22 : మండల పరిధిలోని పాపఘ్ననది బ్రిడ్జి వద్ద నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు. గత కొన్ని రోజులుగా రాత్రి సమయాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న పది ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు..

పెండ్లిమర్రి, ఆగస్టు 22: పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి రవాణాపత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడి మృతి



కలకడ, ఆగస్టు 22: మండలంలోని కోన క్రాస్-కోన మార్గ మధ్యంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో తరుణ్ (24) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడప పట్టణానికి చెందిన తరుణ్ కోన గ్రామానికి చెందిన ఓ ఎక్స్‌కవటేర్ యజమాని వద్ద క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పని చేస్తున్న ప్రాంతం నుంచి బుధవారం చీకటి పడ్డాక సొంత పని మీద వెళ్లుతున్నాని చెప్పి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే రాత్రైయిన రాకపోవడంతో ఆచూకీ కోసం స్నేహితులు చుట్టు పక్కల వెతకగా గురువారం ఉదయం ఘటన స్థలంలో ముళ్లపొదల్లో పడి మృతి చెందినట్లు గుర్తించి సమాచారం ఇచ్చారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

12.5 టీఎంసీలు దాటిన గండికోట నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 22: గండికోట ప్రాజెక్టులో గురువారం సాయంత్రానికి 12.5 నీటిమట్టం దాటినట్లు డీఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 11,000 క్యూసెక్కులు ఉన్నట్లు డీఈ తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి వామికొండ, సర్వరాయసాగర్‌కు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 10న అవుకు రిజర్వాయిర్ నుంచి నీటిని విడుదల చేయగా.. ఇప్పటివరకు 11 టీయంసీలకు పైగా నీరు గండికోట ప్రాజెక్టులోకి వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు.

ఎన్డీఏ కూటమి నాయకులు

గ్రామ సభల్లో పాల్గొనాలి: బీటెక్ రవి

సింహాద్రిపురం, ఆగస్టు 22: పులివెందుల నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ఉపాధి పనులపై జరిగే గ్రామ సభల్లో ఎన్డీఏ కూటమి నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో గ్రామ ప్రజలందరికీ అవసరమైన పనులు గుర్తించి సభలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

నేడు ఉపాధి పనులపై గ్రామ సభలు

సింహాద్రిపురం, ఆగస్టు 22: మండలంలోని అన్ని పంచాయతీలలో ఉపాధి హామీ పనులపై శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ జయభారతి తెలిపారు. ఆయా పంచాయతీల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో సభలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సభలకు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన పనులను సభ దృష్టికి తీసుకురావాలన్నారు.

నేడు గ్రామ సభలు

వల్లూరు, ఆగస్టు 22 : మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పంచాయతీల్లో అభివృద్ధి సంబంధించిన ప్రణాళికలు రూపొందించుట తదితర అంశాలను చర్చించుట కోసం ఈ గ్రామసభలు చేపట్టాలని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు జడ్పీటీసీలు మండల స్థాయి గ్రామ స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

నేడు బీసీ బాలికల వసతి గృహం ప్రారంభం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 22: వీఎన్‌పల్లె బీసీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని వసతి గృహాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ప్రారంభిస్తారన్నారు. టీడీపీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

26న కృష్ణాష్టమి వేడుకలు

సీకేదిన్నె, ఆగస్టు 22: కృష్ణాష్టమి వేడుకలు ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు అమర్‌నాథ్‌యాదవ్ తెలిపారు. అప్పరాజుపల్లె గ్రామంలో వెలసిన క్రిష్ణాలయంలో వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి





పులివెందులలో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ కళాశాలల విద్యార్థినులు.. కడపలో జేవీవీ, విద్యార్థుల ర్యాలీ

పులివెందుల రూరల్, ఆగస్టు 22: చట్టాలను మరింత కఠినంగా అమలు చేసి సమాజంలోని మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని గురువారం విద్యార్థినిలు నినదించారు. కలకత్తాలోని వైద్యురాలి హత్యాచారం ఘటనను నిరసిస్తూ స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో పులివెందులలోని ప్రభుత్వ డిగ్రీ,జూనియర్ కళాశాలల విద్యార్థినిలు ర్యాలీ నిర్వహించారు. ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. బాలికలు, మహిళలపట్ల సమాజ దృక్పథం మారేలా చర్యలు తీసుకోవాలని నినదించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు సుధీర, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నాగేంద్రమ్మ, డాక్టర్ బాలనారాయణ, సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితర అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ హత్యపై విద్యార్థుల నిరసన

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా జేవీవీ, ఎస్‌వీ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు సునీత, సరస్వతి మాట్లాడుతూ మహిళలపై దాడులు చేసిన వారిపై ప్రభుత్వాలు కఠిన శిక్షించాలన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శనరెడ్డి మాట్లాడుతూ హత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జేవీవీ రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్‌రాహుల్, కామేశ్వరమ్మ, మధుసూదన్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు,
అరెస్టయిన వ్యక్తిని చూపుతున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

పులివెందుల, ఆగస్టు22:తొండూరు మండలంలోని మల్లేల గ్రామంలో 28 మద్యంబాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు తొండూరు ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు. అందిన సమాచారం మేరకు గ్రామంలోని ఓ దుకాణంలో నిల్వ ఉంచిన అక్రమ మద్యాన్ని సీజ్ చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేసి, కేసున మోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● కలెక్టర్ లోతేటి శివశంకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 22: తెలుగు భాషా దినోత్సవాన్ని ఈ నెల 29న ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో గిడుగు వెంకటరామ్మూర్తి జయింతిని పురస్కరించుకుని భాషా దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని ఎర్రగుంట్ల మండలంలోని కలమల గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖులను ఆహ్వానించడంతో పాటు తెలుగు భాష పుట్టుక, చరిత్ర, అభివృద్ధిపై ఛాయా చిత్రప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. వేదికను జడ్పీ జీఈఓ, డీపీఓ, డీఈఓలు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను డివిజన్ వారీగా నిర్వహించాలన్నారు. విజేతలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయాలన్నారు. తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేసిన వారికి సన్మాన, సత్కారాలు నిర్వహించాలన్నారు. డీఈఓ అనురాధ, అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా

● కడప ఎమ్మెల్యే మాధవి



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : కడప నగరం బెల్లంమండీవీధిలో విద్యుత్‌షాక్‌కు గురైమృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును కడప ఎమ్మెల్యే మాధవి అందించారు. గురువారం మృతి చెందిన బాలుడి గృహానికి వెళ్లి చెక్కు అందించారు. అనంతరం గాయాలతో చికిత్స పొందుతున్న బాలుడి కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం మాట్లాడుతూ గాయాలపాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వైద్యానికి గురయ్యే ఖర్చు కూడా తాము భరిస్తామని, చదువుకు కూడా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. దుర్ఘటన జరిగిన అతి తక్కువ సమయంలోనే ప్రభుత్వం మృతుడి కుటుంబానికి రూ.ఐదు లక్షలు, గాయపడ్డ విద్యార్థి కుటుంబానికి రూ.2లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు ట్యాంకర్ ద్వారా మంచి నీరు సరఫరా

వల్లూరు, ఆగస్టు 22 : బీచువారిపల్లెలోని ప్రజలకు కడప పార్లమెంటు టీడీపీ బీసీ సంఘం కార్యదర్శి ఇరగనపోయిన హరిక్రిష్ణయాదవ్ మంచినీరు సరఫరా చేశారు. బీచువారిపల్లె గ్రామంలో గత మూడు రోజులుగా మోటార్లు కాలిపోవడంతో మంచినీరు రాలేదు. విషయం తెలుసుకున్న హరిక్రిష్ణయాదవ్, స్థానిక కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులకు ట్యాంకరు ద్వారా మంచినీరు అందించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, శివయ్య, నాగేంద్ర, బాలు, ఎద్దులయ్య, జానకిరామయ్య పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

వల్లూరు, ఆగస్టు 22:మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూలు పూర్వ విద్యార్థి, చెరువుకిందిపల్లెకు చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి పాఠశాలకు క్రీడాదుస్తులను వితరణగా అందించాడని ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడాదుస్తులు అందించడంతో వారు నూతనోత్సాహంతో ఆటలు బాగా ఆడి గట్టి పోటీనిచ్చేందుకు వీలుంటుందన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సుశీలమ్మ పాల్గొన్నారు.

ఆంగ్లభాషలో బోధనా నైపుణ్యాలపై బ్రోచర్ విడుదల

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : వైవీయూ ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆంగ్లబాషలో బోధనా నైపుణ్యాపై ఈ నెల 28న వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు కార్యశాల సమన్వయకర్త డాక్టర్ జయంత్‌కాశ్యప్ తెలిపారు. వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో జరిగే ఈ కార్యశాలకు సంబంధించి బ్రోచరును రిజిస్ట్రార్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసరు గంగయ్య, ఆంగ్ల శాఖ విభాగాధిపతి ప్రొఫెసరు డాక్టర్ జె.మెర్సీవిజేత, సమన్వయకర్త జయంత్‌కాశ్యప్, అకడమిక్ కన్సల్టెంట్ చిట్టిబాబు, డాక్టర్ వై.హరిబాబు పాల్గొన్నారు.

'ప్రొఫెసర్ సురేంద్రనాథరెడ్డిని సస్పెండ్ చేయాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 :గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా అవుట్‌సోర్సింగ్ నియామకాలు నిర్వహించిన అప్పటి రిజిస్ట్రారు ప్రొఫెసరు సురేంద్రనాథరెడ్డిపై విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి నోటిఫికేషన్, రోస్టరు పద్ధతి పాటించకుండా వైవీయూ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీల్లో మాజీ వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రారు వీసీ సురేంద్రనాథరెడ్డి 130 నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేశారన్నారు. నిరుద్యోగులకు అన్యాయం చేసి మోసం చేశారన్నారు. కేవలం వైసీపీకి చెందిన వారికే అవుట్‌సోర్సింగ్ పోస్టులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి సురేంద్రనాథరెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌ల నియామకం



టీడీపీ ఇన్‌చార్జ్‌లను సత్కరిస్తున్న పార్టీ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : కడప నగరం 29వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్‌గా మహ్మద్‌బాషా, 30వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా జియావుద్దీన్‌లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి నియమించారు. గురువారం 29, 30 డివిజన్ల ఉమ్మడి కార్యాలయంలో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా మహ్మద్‌బాషా జియావుద్దీన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షకీరా, రమేశ్‌బాబు, ఇమ్రాన్, షేక్షా, నూర్, సమీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్, ఆగస్టు 22: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న డిపోమేనేజర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రయాణికులు ఫిర్యాదులు, విన్నపం, సూచనలు తెలియజేయవచ్చన్నారు. 99592 25780 నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడవచ్చని లేదా వాట్సప్ మెసేజ్ చేయవచ్చన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరానికి స్పందన

వల్లూరు, ఆగస్టు 22 : స్థానిక కస్తూర్బా పాఠశాలలో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని డాక్టర్ షాకిర్‌హుసేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా హోమియోపతి మందులను బాలికలకు అందించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ వ్యాధులను నిరోధించడంలో హోమియోపతి మందులు ఉపయోగపడతాయన్నారు. సైడ్ ఎఫెక్ట్ కూడా ఉండదన్నారు. హోమియోపతి ఔషధం దీర్ఘకాలిక సైనసైటీస్, కీళ్లనొప్పులు, మూత్రపిండాల్లో రాళ్లు తదితర వ్యాధుల నివారణకు పనిచేస్తుందన్నారు.

కడపలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి

కడప(కలెక్టరేట్), ఆగస్టు 22: కడప నగరంలో తెలుగు తల్లి విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌లకు తెలుగు భాషా వికాస ఉద్యమం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ గానుగపెంట హనుమంతరావు విన్నవించారు. గురువారం ఆయన కలెక్టర్, జేసీలకు వినతిపత్రం అందజేశారు.

కడప ట్రాఫిక్ సీఐగా జావేద్



మాట్లాడుతున్న జావేద్

కడప (క్రైం), ఆగస్టు 22: కడప ట్రాఫిక్ సీఐగా డీకే జావేద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలమల స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై కడప ట్రాఫిక్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు నగరంలో విధులు నిర్వహిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్న చోట తమ సిబ్బందితో ట్రాఫిక్ క్లియర్ చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మాలల అభ్యున్నతికి నిరంతర కృషి

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్



ప్రమాణ స్వీకారం చేస్తున్న తాళ్లపాక వినోద్‌కుమార్

కడప (మారుతీనగర్), ఆగస్టు 22: మాలల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాంజి ఇమ్మానియేలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన వినోద్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, వైద్య రంగాలలో మాలలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పాలకులతో పోరు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబన్న, జిల్లా అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు

వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని మంత్రికి వినతి



మంత్రి సత్యకుమార్‌కు
సమస్యను వివరిస్తున్న గాలి హరిప్రసాద్

వేంపల్లె, ఆగస్టు 22: వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం విజయవాడ బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో నిలిచిపోయిన ప్రభుత్వ ఆసుపత్రి భవననిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరామన్నారు. తొమ్మిది మందికి గాను ఐదుగురు వైద్యులుమాత్రమే ఉన్నారని, వివిధ విభాగాలకో కూడా ఖాళీ ఉన్న పోస్టులను భర్తీచేయలాని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఖాళీలు భర్తీచేయడంతో పాటు కిడ్నీరోగుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్బారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, భానుప్రకాష్, పవన్‌కుమార్, రోషన్న, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేంపల్లె, ఆగస్టు 22: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. గురువారం మండలంలోని తాళ్లపల్లెలో ఇంటింటా ఫీవర్‌సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు మలేరియా, డెంగ్యూవ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమ కాటు వలన వచ్చే ప్రాణాంతక వ్యాధులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశాకార్యకర్త సుజాత పాల్గొన్నారు.

నులిపురుగులు చేరకుండా జాగ్రత్త వహించాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 22: నులిపురుగులు చేరకుండా జాగ్రత్త వహించాలని ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, తొండూరు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య విద్యార్థులకు సూచించారు. గురువారం తొండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన, చెప్పులు లేకుండా తిరగడం, శుభ్రపరచని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను తినడం, పరిశుభ్రతమైన నీరు వాడకపోవడం ద్వారా జీర్ణాశయంలోకి నులిపురుగులు చేరుతాయన్నారు. నులిపురుగుల చేరికతో బలహీనత, నీరసం, రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం, చురుకుదనం లోపించడం, తరచూ కడుపునొప్పి విరేచనాలు, రక్తవిరేచనాలులాంటివి సంభవిస్తాయన్నారు. నులిపురుగులు చేరకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు. నులిపురుగు నివారణకు అల్బెండాటల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గోవర్ధనరెడ్డి జన్మదిన వేడుకలు



అన్నదాన కార్యక్రమంలో గోవర్ధనరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : కడప నగరంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కడప నగర శివారులోని సాయిబృందం అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరు జన్మదిన వేడుకలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : కడప నగరంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో చిరు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు.

సుంకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో...



కేక్ కట్ చేస్తున్న సుంకర శ్రీనివాస్

కడప నగరం అప్సర థియేటరులో జనసేన పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో చిరంజీవి 69వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జనసేన ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటరు సుంకర శ్రీనివాస్ కేకను కట్ చేసి మెగా అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుంగా రమణయ్య ఆధ్వర్యంలో...



కేక్ కట్ చేస్తున్న తుంగా రమణయ్య

కడప నగరం ప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో జనసేన టీడీపీ నాయకుల సమక్షంలో జనసేన నాయకుడు తుంగా రమణయ్య కేక్ కట్ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని స్వయం కృషితో ప్రతి రంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సాయి, ఉంగరాల విజయ్, చార్లెస్, తుంగ మధు, కిరణ్, మల్లి, టీడీపీ మాజీ కార్పొరేటరు రాజగోపాలరెడ్డి, చినబాబు, నాయకులు శ్రీనివాసులు, తిరుమలయ్య, గుణశేఖర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న తుంగా రమణయ్య

కడప కనుమలోపల్లె కామాక్షమ్మ ఆలయంలో జనసేన నాయకులు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో నూరు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే అది సర్వమానవాళిని కాపాడుతుందన్నారు. కోట్లాది మందికి మార్గదర్శిగా నిలిచిన చిరంజీవి జన్మదిన సందర్భంగా వంద మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్న మెగాస్టార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాయిగజ్జల, ఉంగరాల విజయ్, చార్లెస్. తుంగా మధు, కిరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గాయపడ్డ చిన్నారిని పరామర్శించిన అమీర్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : కడప నగరం బెల్లంమండీ వీధికి చెందిన ఇద్దరు విద్యార్థులు విద్యుత్‌షాక్‌కు గురై అందులో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొక అబ్బాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు గురువారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని, ఇటువంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా విద్యుత్ శాఖ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇమ్రాన్, డాక్టర్ వరకుమార్ పాల్గొన్నారు.



వేడుకగా రాఘవేంద్రుడి ఆరాధన మహోత్సవాలు



పుష్పాలంకరణలో బృందావనం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 22: స్థానిక పాత రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారి బృందావనానికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో, వెండికవచాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం రాఘవేంద్రస్వామి మహిమల గురించి ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.

ప్లాస్టిక్ వినియోగించడం మానేయండి

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ర్యాలీ మానవహారం



ప్రొద్దుటూరులో చేపట్టిన భారీ ర్యాలీ

ప్రొద్దుటూరు ఆగస్టు 22: ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కమిషనర్ రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సచివాలయ ఉద్యోగులు మెప్మ, మున్సిపల్ టీచర్లు హెడ్మాస్టర్లు విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద ఎత్తున భారీ ప్రదర్శన చేపట్టారు. గాంధీరోడ్డు టీబీ రోడ్డు శివాలయం రోడ్డు గుండా పుట్టపర్తి సర్కిల్ వరకు సాగింది. అనంతరం అక్కడ ప్లాస్టిక్‌ను మానేద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ మానవహారంగా ఏర్పడి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు బాటిళ్ళు గ్లాసులు ప్లేట్లు లాంటి వినియోగం పూర్తిగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాయన్నారు. కానీ అక్రమంగా మార్కెట్‌లో వాటిని విక్రయించినా, కొన్నా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్లాస్టిక్ వల్లే డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసే వినాయక విగ్రహాల వాడకంతో నదులు కాలుష్యం అవుతాయన్నారు. కేవలం మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సాయిక్రిష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూరు బాషా వంకం సుబ్బరాయుడు, మెప్మా టీఈ కెజియా మున్సిపల్ పాఠశాలల హెడ్మాస్టర్లు, టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఏపీఎం రమణ

చాపాడు, ఆగస్టు 22: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే వారి కుటుంబాలు సంతోషంగా ఉంటాయని ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు అన్నారు. చాపాడు వెలుగు కార్యాలయంలో గురువారం డ్వాక్రా మహిళా సంఘాల వార్షిక మహాసభలో ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి మండల సమాఖ్య ఆర్థిక లావాదేవీలు రూ.85,85,881 జరిగినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు ఆదాయం రూ.7,21,754 వచ్చినట్లు చెప్పారు. ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్ మాట్లాడుతూ స్త్రీ నిధి ద్వారా మహిళలకు రుణాలు ఇచ్చి లక్ష్యాన్ని చేరుకున్నట్లు చెప్పారు. మహిళా సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించాలన్నారు. ఏపీఎం రమణ మాట్లాడుతూ మండల సమాఖ్య కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. అధ్యక్షురాలిగా మరియమ్మ, ఉపాధ్యక్షురాలిగా నాగలక్షుమ్మ, గురుదేవి, కార్యదర్శిగా రామలక్ష్మి, కోశాధికారిగా ఇమామ్‌బీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వారితో రమణ ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో సీసీలు సుబ్బరత్న, రాజా, తులసి, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల, ఆగస్టు 22: కలకత్తా ఘటనపై నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నేతలు రవి డిమాండ్ చేశారు. కలకత్తాలో జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారం నిరసిస్తూ గురువారం పోరుమామిళ్లలో వెంకటేశ్వర డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేసి మానహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు వీరాచారి, ప్రేమ్‌కుమార్, వంశీ పాల్గొన్నారు.

'ప్రొఫెసరు సురేంద్రనాథరెడ్డిని సస్పెండ్ చేయాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22: వైసీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్ లేకుండా అవుట్‌సోర్సింగ్ నియామకాలు చేపట్టిన అప్పటి రిజిస్ట్రారు ప్రొఫెసరు సురేంద్రనాథరెడ్డిపై విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి నోటిఫికేషన్, రోస్టరు పద్ధతి పాటించకుండా వైవీయూ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీల్లో మాజీ వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రారు వీసీ సురేంద్రనాథరెడ్డి 130 నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేశారన్నారు. నిరుద్యోగులకు అన్యాయం చేసి మోసగించారని ఆరోపించారు. కేవలం వైసీపీకి చెందిన వారికే అవుట్‌సోర్సింగ్ పోస్టులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి సురేంద్రనాథరెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు గంగాధర్, జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

'కమర్షియల్'కు దీటుగా డీసీసీబీ

ఆర్‌బీఐ అనుమతితోనే లావాదేవీలు ● ఎర్రగుంట్ల, ముద్దనూరుల్లో డీసీసీబీ శాఖల ప్రారంభంలో ఎమ్మెల్యే బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి ● లాభాల బాటలో పయనిస్తోంది : సీఈఓ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల/ముద్దనూరు ఆగస్టు 22: కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీబీ సేవలు అందిస్తుందని, అన్నిరకాల రుణాలను అందిస్తామని, ప్రస్తుతం లాభాల బాటలో డీసీసీబీ ఉందని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, సీఈఓ రాజీమణి వివరించారు. ఎర్రగుంట్ల, ముద్దనూరుల్లో డీసీసీబీ శాఖలను ప్రారంభించారు. ఎర్రగుంట్ల నగర పంచాయతీ చైర్మన్ ఎం.హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ఏర్పాటు చేసిందని, దీని ద్వారా అన్ని రకాల రుణాలు ఇస్తారన్నారు. అన్ని వర్గాల వారికి వాహన రుణాలు, డ్వాక్రా సభ్యులు, వ్యాపారులు, రైతులు, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగుల డిపాజిట్స్, ఇతర లావాదేవీలకు అనువుగా ఉంటుందన్నారు. డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ, రుణాలపై తక్కువ వడ్డీ ఇస్తుందన్నారు. డీసీసీబీకి ఆర్‌బీఐ అనుమతి ఉందన్నారు. డ్వాక్రా మహిళలకు ఇతర బ్యాంకుల కంటే తక్కువ వడ్డీలకు ఇస్తున్నారన్నారు. చిలన్నపిల్లలకు కూడా ప్రత్యేక ఆఫర్లు ఉన్న దృష్ట్యా వారికి కూడా ఖాతాలు తెరవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామక్రిష్ణ, తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీఓ బాగ్యలక్ష్మి, బ్యాంకు అధికారులు, టీడీపీ, బీజేపీ నేతలు ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, ఎస్.సంజీవరెడ్డి, ఎస్.సూర్యనారాయణరెడ్డి మల్లు గోపాల్‌రెడ్డి, కూటమి నేతలు, బ్యాంకు భవన యజమాని గంగా శివారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ముద్దనూరు బ్రాంచ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం డీసీసీ బ్యాంకు ఏర్పాటు చేశారని, ప్రతి ఒక్కరూ డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఈఓ రాజమణి మాట్లాడుతూ డీసీసీబీ కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీబీలో సేవలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం లాభాల బాటలో డీసీసీబీ ఉందని, ఈ ఏడాది ఆర్బీఐ నుంచి నాలుగు బ్రాంచ్‌ల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. ముద్దనూరు, ఎర్రగుంట్లలో బ్రాంచ్‌లు ప్రారంభించామని రామేశ్వరం, బ్రహ్మంగారిమఠంలో వచ్చేనెలలో ప్రారంభిస్తామన్నారు. మొబైల్ బ్యాంకింగ్, హౌసింగ్, వాహన రుణ సదుపాయాలు ఉన్నాయన్నారు. మొదట ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రూ.20వేలు చెల్లించి ఖాతాదారుడుగా నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీఓ సుహాసిని, డీఎల్‌సీఓ సురేష్‌కుమార్, ఎస్‌డీఎల్‌సీ ప్రభాకర్‌రావు, ఇన్‌చార్జి బ్రాంచ్‌మేనేజర్ మేరి, తహసీల్దారు రామకుమారి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, ఏన్డీయే నేతలు మధుసూదనరెడ్డి, అల్లీషేర్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

కొండాపురం, ఆగస్టు 22: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం కొండాపురం మండల సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల గురించి చర్చించారు. టి.కోడూరు ఎస్సీ కాలనీలో కరెంటు తీగలు స్కూల్ పిల్లలకు ఇబ్బందిగా ఉన్నందున వీటిని మార్చాలని విద్యుత్ ఏఈ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని కోడూరు ఎంపీటీసీ రామమునిరెడ్డి ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో టి.కోడూరు జడ్పీ హైస్కూల్‌లో నాడు నేడు పనుల్లో గోల్‌మాల్ జరిగిందని విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగప్రసాద్ కోరారు. కార్యక్రమంలో డీటీ రాజేశ్వరమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

26న వరసిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠ

జమ్మలమడుగు, ఆగస్టు 22: ఈనెల 26వ తేదీ సోమవారం నుంచి మూడు రోజులు వరసిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మోరగుడి గ్రామం చలం గారి వీధిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో 26వ తేదీ ఉదయం మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, జరుగును. 27న ప్రాతఃకాల పూజలు, వేదపారాయణం, పంచామృతాభిషేకం జరుగును. సాయంత్రం హోమాలు, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు జరుగును. 28న బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ జరుగును. భక్తులు విగ్రహ ప్రతిష్ఠకు హాజరుకావాలని కోరారు. అన్నదానం ఉంటుందని, కమిటీవారు తెలిపారు.

ఆటో, ట్యాంకర్ ఢీ

అట్లూరు, ఆగస్టు 22: కొండూరు వద్ద బద్వేలు వైపు వెళుతున్న ప్యాసింజరు ఆటోను కడప నుంచి వస్తున్న పెట్రోలు ట్యాంకర్ వెనక వైపు నుంచి ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటమ్మ, సంజమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటమ్మ, నాగమ్మ, తులశమ్మ, వైష్ణవి, రామలక్ష్మమ్మ, గోపాలలక్ష్మమ్మ, సంధ్యమూర్తికి స్వల్పగాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వీరు రెడ్డిపల్లెలో గృహప్రవేశానికి వెళ్లి తిరిగి బద్వేలుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ట్యాంకర్ డ్రైవరును అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ల అకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

మైలవరం, ఆగస్టు 22: తలమంచిపట్నం, మైలవరం పోలీస్ స్టేషన్లను ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం అకస్మిక తనిఖీ చేశారు. జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డితో కలిసి రికార్డులను తనిఖీ చేసి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదులను పరిశీలించి నిర్దిత సమయంలో వాటిని పరిష్కరించాలని, గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు.

నాలుగో రోజుకు చేరుకున్న రిలే దీక్షలు

బద్వేలు, ఆగస్టు 22: ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న కార్మిక మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉమ, దుర్గమ్మ మాట్లాడుతూ సి. కొత్తపల్లె 54/1, 54/2, 54/3, 54/4 సర్వే ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమితులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పలువురు మహిళలు కూర్చున్నారు.

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటసుబ్బయ్య

కొండాపురం, ఆగస్టు 22: రైతులు తప్పకుండా ఈ-క్రాప్ చేయించుకోవాలని ముద్దనూరు ఏడీఏ వెంకటసుబ్బయ్య కోరారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో గురువారం సిబ్బందితో సమీక్షించారు. ప్రతి సర్వే నంబరు తిరిగి వీఆర్వో, వీఏఏలతో కలిసి ఈ-క్రాప్ కార్యాక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలు పొందాలంటే రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏఓ ఎవి రామాంజులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కొండాపురం, సింహాద్రిపురం రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు వినతి



మంత్రి సత్య కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

మైదుకూరు రూరల్, ఆగస్టు 22: ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ మాజీ కౌన్సిల్ మెంబర్ బీపీ ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిశారు. రాష్ట్ర కార్యాలయంలో మంత్రి సత్యకుమార్‌ను కలిసి మైదుకూరులో ఉల్లి పరిశోధన కేంద్రం కోసం తెలుగుగంగ ప్రాజెక్ట్ భూమిని కేటాయించాలని కోరారు. సత్యకుమార్ జలవనరుల శాఖ కార్యదర్శి సాయిప్రసాద్‌తో కొద్ది సేపు చర్చించారని ఆయన తెలిపారు.

మంచి చేతిరాత కలిగి ఉండాలి



బహుమతులు పొందిన చిన్నారులతో సీఐ శ్రీనివాసులు

పోరుమామిళ్ల, ఆగస్టు 22: మారుతున్న కాలానికనుగుణంగా ప్రతి విద్యార్థికీ అందమైన చేతిరాత అవసరమని ఆలిండియా హ్యాండ్ రైటింగ్ స్టేట్‌ప్రెసిడెంట్ మల్లేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఓఎల్ఎఫ్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు చేతిరాతపై శిక్షణ ఇచ్చి మెళకువలు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రైటింగ్ మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి బాలఅంకిరెడ్డి, సీఐ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి, సిస్టర్ విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీల వారీ గ్రామసభలు

అట్లూరు, ఆగస్టు 22: మండలంలోని ఏడు సచివాలయాలు 12 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుజాతమ్మ తెలిపారు. గ్రామ సభల్లో ప్రజలు తమ సమస్యలను తెలపవచ్చన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ రకాల పథకాలు లబ్ధి పొందేందుకు, ఉపాధి హామీ, తాగునీటి సమస్యలు, పలు రకాల సమస్యలను ఫిర్యాదు రూపంలో తెలపవచ్చని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభలకు అన్ని శాఖల అధికారులు హాజరవాలని కోరారు.

అన్ని పంచాయతీల్లో గ్రామసభలు

మైదుకూరు రూరల్, ఆగస్టు 22: మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి పంచాయతీరాజ్ అధికారులు, రెవెన్యూ, ఫారెస్ట్, సోషియల్ వెల్ఫేర్, వ్యవసాయశాఖ, వెటర్నరీ తదితర శాఖల అధికారులు హజరవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

ముద్దనూరులో... మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనులు గుర్తింపు కోసం శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు.

బి.కోడూరులో... మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు పంచాయతీ సభల్లో తప్పక హాజరవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

కొండాపురంలో... మండలంలోని 28 పంచాయతీల్లో ఉపాధి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. ఆయా పంచాయతీల పరిధి సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి గ్రామసభలు ఉంటాయన్నారు. ఈ సభలో ప్రజలు తమకు కావలసిన వసతులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీఓ ఒక ప్రకటనలో కోరారు.

ఆటోబోల్తా - ఒకరికి గాయాలు



టోల్‌ప్లాజా వద్ద బోల్తాపడిన ఆటో

ఖాజీపేట, ఆగస్టు 22: కడప-కర్నూలు జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఆటో బోల్తా పడి ఒకరికి గాయాలయ్యాయి. కడప నుంచి ఖాజీపేటకు పని నిమిత్తం వచ్చి పని ముగించుకుని తిరిగి వెళుతుండగా బ్రేక్ కట్టర్ చూడకపోవడంతో ఆటో బోల్తాపడింది. కడపకు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు టోల్‌ప్లాజా సిబ్బంది తరలించారు.

నులిపురుగులతో రక్తహీనత

పులివెందుల రూరల్, ఆగస్టు 22: నులిపురుగులు చేరికతో రక్తహీనత, ఎదుగుదల కాకపోవడం వంటి సమస్యలు ఉంటాయని, అవి చేరకుండా జాగ్రత్త వహించాలని హెచ్ఎం సుబ్బారెడ్డి, తొండూరు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య విద్యార్థులకు సూచించారు. గురువారం జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో మల్లయ్య మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన, చెప్పులు లేకుండా తిరగడం, శుభ్రపరచని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను తినడం, పరిశుభ్రమైన నీరు వాడకపోవడం ద్వారా జీర్ణాశయంలోకి నులిపురుగులు చేరతాయన్నారు. నులిపురుగుల చేరికతో బలహీనత, నీరసం, రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం, చురుకుదనం లోపించడం, తరచూ కడుపునొప్పి విరేచనాలు, రక్తవిరేచనాలులాంటివి సంభవిస్తాయన్నారు. నులిపురుగుల నివారణకు అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

పోరుమామిళ్ల, ఆగస్టు 22: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పోరుమామిళ్ల పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ యనమల సుధాకర్ కేక్ కట్ చేసి చిరంజీవి అభిమానులు, కార్యకర్తలకు పంపణీ చేశారు. కార్యక్రమంలో చెన్నురమణ, సుబ్బయ్య, నరేశ్, లక్ష్మణరావు, వెంకటయ్య, అతికారి రాజా, జనసేన తదితర నేతలు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 22: తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 29న గిడుగు వెంకటరామ్మూర్తి జయింతిని పురస్కరించుకుని భాషా దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని తన చాంబరులో సంబంధిత అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని ఎర్రగుంట్ల మండలం కలమల గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖులను ఆహ్వానించడం, తెలుగు భాష పుట్టుక, చరిత్ర, అభివృద్ధిపై ఛాయా చిత్రప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. వేదికను జడ్పీ సీఈఓ, డీపీఓ, డీఈఓలు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను డివిజన్ వారీ నిర్వహించాలన్నారు. విజేతలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయాలన్నారు. తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేసిన వారికి సన్మాన, సత్కారాలు నిర్వహించాలన్నారు. డీఈఓ అనురాధ, జిల్లా అధికారులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వను పూడ్చిన షాపింగ్ కాంప్లెక్స్ యజమాని

కలెక్టరుకు ఫిర్యాదుతో కదలిన మున్సిపల్ సిబ్బంది



పూడ్చిన కాల్వను వెలికి తీస్తున్న మున్సిపల్ సిబ్బంది - కాల్వను పూడ్చి అక్రమంగా నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

ప్రొద్దుటూరు, ఆగస్టు 22: సూపర్ బజార్‌రోడ్డులో నిర్మాణమౌతున్న ఒక షాపింగ్ కాంప్లెక్స్ యజమాని ఏకంగా మున్సిపల్ కాల్వపై పైపువేసి పూడ్చివేశాడు. దీంతో కాల్వలో మురుగు ప్రవాహం నిలిచిపోయి ఇళ్లలోనే మురుగు నీరు వెనక్కి వస్తోందని స్థానికులు వాపోయారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ సమస్యపై సూపర్ బజార్ రోడ్డులోని వైద్యుడు రంగారెడ్డి, లాయర్ దత్తాత్రేయ కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి శానిటరీ సిబ్బందిని పంపి అక్కడ పూడ్చిన కాల్వను యంత్రాలతో తీశారు. భవన యజమాని న్యాయస్థానంలో ఉన్నత పదవిలో వుండి షాపింగ్ కాంప్లెక్స్‌కు రెసిడెన్సియల్ కింద అనుమతులు పొంది అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినట్లు సచివాలయ ప్లానింగ్ సిబ్బంది చెబుతున్నారు. పూడ్చిన మున్సిపల్ కాల్వపై ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అవినీతి అధికారిపై చర్యలు తీసుకోకపోతే పట్టణం అంతా అక్రమ కట్టడాలు వెలుస్తాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై మున్సిపల్ కాల్వను పూడ్చి నిర్మించిన ట్రాన్స్ ఫార్మర్ దిమ్మెను సైతం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కమిషనర్ రఘునాథరెడ్డి టౌన్‌ప్లానింగ్ అవినీతి అధికారికి వత్తాసు పలకకుండా దిమ్మె తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.